క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం వద్ద సర్పంచ్ స్వప్న, కార్యదర్శి సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు గ్రామం వద్ద ఉన్న బస్‌షెల్టర్‌లో మంగళవారం సర్పంచ్ స్వప్న, గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం తాగునీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ కేటీరోడ్డు నుంచి కంచనపుత్తూరు గ్రామానికి రెండు కిలోమీటర్లు దూరం ఉండడంతో గ్రామస్తులకు తాగునీటి ఇబ్బంది లేకుండా ఉంటుందని చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో ఎండ వేడిమిని తట్టుకోవాలంటే ఎక్కువగా నీటిని తాగాలని తెలిపారు. తాగునీటికోసం ఎవరూ ఇబ్బంది పడకుండా ఉండాలంటే చలివేంద్రాలు అవసరమని ఇందుకోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పవర్ టిల్లర్‌తో ఎంతో ఉపయోగం



చెరుకులో కలుపు తీస్తున్న పవర్ టిల్లర్

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని చెరకు రైతులకు పవర్ టిల్లర్‌తో ఎంతో ఉపయోగమని వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు. ఆమె మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని రైతులకు పవర్ టిల్లర్ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పవర్ టిల్లర్‌తో భూమి దున్నడం, చెరుకులో కలుపు తీయడం లాంటి పనులు తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో చేపట్టవచ్చన్నారు. చెరుకు సాగులో పవర్ టిల్లర్ వాడకం వలన కలిగే ప్రయోజనాలు తెలిపారు. సబ్సిడీతో పవర్ టిల్లర్‌ను రైతులకు సరఫరా చేస్తున్నారని, ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బంగారం, వెండి చోరీ



చోరీ జరిగిన శంకర్ రాజు ఇల్లు

నాగలాపురం: తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగలగొట్టి బంగారం, వెండి, నగదు చోరీ చేసిన ఘటన పిచ్చాటూరు మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశులు కథనం మేరకు.. సిద్ధిరాజుకండ్రిగకు చెందిన శంకర్‌రాజు అనారోగ్యంతో ఈ నెల 21వ తేదీన తిరుపతిలోని తన కొడుకు వద్ద ఉంటామని వెళ్లాడు. మంగళవారం ఉదయం స్థానికులు శంకర్‌రాజుకు ఫోన్ చేసి మీ ఇంటి తాళాలు తెరిచి ఉన్నాయని సమాచారం ఇచ్చారు. వెంటనే శంకర్ రాజు తిరుపతి నుంచి సిద్ధిరాజుకండ్రిగలోని తన ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలోని 10 తులాల బంగారం, 4.5 కిలోల వెండి, 10 వేలు నగదు, 250 యూఎస్ డాలర్లు, 170 మలేసియా రింగ్స్ చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశులు తెలిపారు.

నేడు నల్ల గంగమ్మ జాతర

శ్రీకాళహస్తి : పట్టణంలో బహుదూర్ పేట తెట్టు వద్ద నల్ల గంగమ్మ జాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం చైర్మన్ కంఠా రమేష్ మంగళవారం తెలిపారు. బుధవారం జాతరను ఘనంగా నిర్వహిస్తామని, పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. జాతర నేపథ్యంలో తెట్టు ప్రాంతంలో విద్యుత్ దీపాలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

నిర్మించారు..వదిలేసారు..!



నిరుపయోగంగా ఉన్నట్యాంకును చూపుతున్న మహిళలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ తిమ్మయ్య గుంట దళితవాడలో మంగళవారం సీపీఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. స్థానికులు సమస్యలను సీపీఎం నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. 9 సంవత్సరాల క్రితం రూ.15.50 లక్షలతో నిర్మించిన నీళ్ల ట్యాంకును ఇంతవరూ ప్రారంభించలేదని తెలియజేశారు. అలాగే, శ్మశాన వాటిక లేక పడుతున్నట్లు అవస్థలను చెప్పారు. సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ, ప్రజా చైతన్యయాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు చెప్పారు. సీపీఎంనాయకులు ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, భారతి, స్థానికులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ కష్టాలు

రేణిగుంట మండలంలో ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందాలన్నా, పాఠశాలలు, కాలేజీలలో ఏ అవసరం ఉన్న ఆధార్ కార్డు ప్రధానం కావడంతో ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం సెంటర్లకు బారులు తీరుతున్నారు. సచివాలయ ఉద్యోగులు పనిభారం మూలాన తర్వాత రండి అని చెబుతూండడంతో వివిధ కేంద్రాలకు ప్రజలు పరుగులు తీయడమేకాకుండా రోజుల తరబడి ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

- 19 పంచాయతీలకు రెండే ఆధార్ సెంటర్లు
- వీటిలో ఒకటి సిబ్బంది లేక మూత



గాజులమండ్యం సచివాలయానికి వచ్చి వెనుదిరుగుతున్న చిన్నపిల్లల తల్లిదండ్రులు



రేణిగుంట 4వ సచివాలయంలో సిబ్బంది లేక మూసేసిన ఆధార్ సెంటర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మండలంలో రెండు ఆధార్ నమోదు కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. రేణిగుంట మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న నాలుగో సచివాలయం ఒకటి, గాజుల మండ్యం సచివాలయంలో మరొకటి ఉన్నాయి. రేణిగుంట సచివాలయ సిబ్బంది అధిక పని భారం వలన గాజులమండ్యం సచివాలయానికి వెళ్లమంటూ సూచిస్తున్నారు. అందరికీ అప్‌డేట్ చేసేందుకు వీలుకాని పక్షంలో టోకెన్‌లలో మూడు రోజుల తర్వాత డేట్‌ను స్లిప్‌లో వేసి పంపుతున్నారు. ఫలితంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు రోజుల తరబడి ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ నమోదు కేంద్రాలను పెంచి ఈ ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు.

వారం నుంచి చక్కర్లు



మా కుమారుడికి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని స్కూల్లో చెప్పారు.. మొదటగా మంగళం ఆధార్ సెంటర్‌కు వెళ్లాను.అక్కడ వారు జీవకోనకు వెళ్లమని చెప్పారు. అక్కడికి వెళ్లినా కూడా పని అవలేదు. రేణిగుంట ఎంపీడీఓ ఆఫీస్ వద్ద ఉన్న ఆధార్ సెంటర్‌కు వచ్చాను. శుక్రవారం నుంచి తిరుగుతున్నా ఆధార్ అప్‌డేట్ చేయలేదు. చివరకు మంగళవారం గాజుల మండ్యం సచివాలయ ఆధార్ కేంద్రానికి వచ్చాను. ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉండడంతో గురువారానికి టోకెన్ ఇచ్చారు. ఇప్పటికే దాదాపుగా 2000 రూపాయలు బస్సు చార్జీలు, ఆటోలకు అయ్యాయి. గురువారమైనా అప్‌డేట్ చేస్తారో, లేదో తెలియదు.

-మారెమ్మ, గొల్లపల్లె, కరకంబాడి పంచాయతీ, రేణిగుంట మండలం

ఆటో బాడుగకే రూ.400 అయ్యింది.



మాది రేణిగుంట. మా తమ్ముడికి ఆధార్ అప్‌డేట్ కోసం ఫస్ట్ పంచాయతీ ఆఫీసుకు, ఆ తర్వాత నాలుగో సచివాలయానికి వెళ్లా. శుక్రవారం అక్కడికి వెళ్తే సోమవారం రమ్మన్నారు. సోమవారం వెళ్తే మంగళవారం రమ్మన్నారు. ఈరోజు వెళ్తే ఇక్కడ మేడం లేరు. గాజుల మండ్యం సచివాలయానికి వెళ్లండని చెప్పారు. ఉస్సూరంటూ చిన్న పిల్లలతో గాజుల మండ్యంకు రానూ పోనూ ఆటోలకు రూ.400 అయ్యింది. ఇక్కడా జనమే. గురువారం రమ్మని చెప్పి టోకెన్ ఇచ్చారు.. చిన్నపిల్లల ఆధార్ అప్‌డేట్ కోసం ఇలా తిరగాల్సి రావడం ఇబ్బందిగా ఉంది.

-కరీముల్లా రేణిగుంట

రేణిగుంటకి వెళితే గాజులమండ్యం



పిల్లలకు ఆధార్ కార్డులు తీసుకునేందుకు రేణిగుంట సచివాలయానికి వెళ్లాం. సచివాలయంలో మేడం లేరు. గాజులమండ్యంకు వెళ్లమన్నారు. ఇక్కడ సచివాలయంలో టోకెన్ ఇచ్చి రెండు రోజుల తర్వాత రమ్మని చెప్పారు. ఆధార్ కేంద్రాలు ప్రతి పంచాయతీలో పెడితే బాగుంటుంది.

-భారతి, చెంగారెడ్డిపల్లె, రేణిగుంట

నేడు పంచాయతీ షాపింగ్ గదుల వేలం

నాగలాపురం: గ్రామ పంచాయతీ షాపింగ్ గదులను 2025-26 సంవత్సరానికి స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు పంచాయతీ షాపింగ్ గదులు, మధ్యాహ్నం 2 గంటలకు వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండ్, జంతు వధశాలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు పంచాయతీ కార్యాలయంలో సాల్వెన్సు సర్టిఫికెట్ పొంది డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

పాపం పండింది

శ్రీకాళహస్తి: తిరుమలలో కారు అద్దాలు పగులగొట్టి దొంగతనం చేసి పట్టుబడ్డ హేమచంద్రారెడ్డిని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై ఎన్నికల ముందు టీడీపీ నాయకులు అస్త్రంగా వాడారు. ఆలయంలో వెండిని మధుసూదన్‌రెడ్డి ఎత్తుకెళ్లారంటూ అప్పట్లో దుష్ప్రచారం చేశారు. అయితే ఆలయ అధికారులు వెండి ఆలయం నుంచి తీసుకెళ్లడం సాధ్యం కాదని వివరణ సైతం ఇచ్చారు. అయినా బొజ్జల సుధీర్‌రెడ్డి హేమచంద్రారెడ్డి మాటలను పదే పదే ప్రస్తావిస్తు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నించాడు. అయితే ప్రస్తుతం హేమ చంద్రారెడ్డి పలు కేసుల్లో ముద్దాయిగా పట్టుబడ్డాడు. తాకట్టులో ఉన్న బంగారు కొనబడును అనే కంపెనీల సిబ్బందితో బంగారం విడిపించుకుని వస్తానని డబ్బులు తీసుకుని ఉడాయించిన ఘనుడు హేమచంద్రారెడ్డి. బెట్టింగ్‌లకు బానిస అయి చివరకు దొంగతనాలకు పాల్పడుతూ తిరుమలలో పట్టుబడటంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇలాంటి దొంగలు చెప్పిన మాటలను టీడీపీ వాడుకుందని విమర్శలొస్తున్నాయి. చేసిన తప్పులకు పాపం పండిందని పలువురు అంటున్నారు.

వైఎస్సార్‌సీపీ సేవాదళ్ మండల కన్వీనర్‌కు మాతృ వియోగం



విమలమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మండలంలోని కడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సేవాదళ్ మండల కన్వీనర్ సందీప్ (నాని)రెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి పి.విమలమ్మ మంగళవారం తెల్లవారుజామున ఆకస్మిక మరణం చెందింది. సమాచారం అందుకున్న నూకతోటి రాజేష్ కడూరులోని నానిరెడ్డి నివాసానికి చేరుకుని విమలమ్మ మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బత్తలవల్లంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వెంకటసుబ్బారెడ్డి సతీమణి మృత దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్మిక విభాగం మాజీ అధ్యక్షులు బీరేంద్ర వర్మ, మండల పార్టీ అధ్యక్షులు నాయుడు దయాకర్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ మాజీ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, నాయకులు బొప్పన తిలక్‌బాబు, సాయిరెడ్డి, సుబ్రమణ్యం, కవిత, శివా యాదవ్, విజయ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం



పుదుకుప్పంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



సత్యవేడులో టీటీడీ కల్యాణ మండపం సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: పుదుకుప్పం పంచాయతీలో లోఓల్టేజీ సమస్యను పరిష్కారానికి ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. భారత ప్రభుత్వం పునరుద్ధరించబడిన పంపిణీ రంగ పథకం(ఆర్.డి.ఎస్ఎస్) ద్వారా మంగళవారం పుదుకుప్పంలో 63 కేవీ ఒకటి, 100 కేవీ 4 ట్రాన్స్‌ఫార్మర్లు ఎమ్మెల్యే స్థానిక సర్పంచ్ నాగమణి, పార్టీ నాయకులతో కలసి ధర్మరాజుల గుడి సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు పర్యాయాలు పంచాయతీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరడంతో విద్యుత్ సరఫరా మెరుగు పరిచేందుకు ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. అంతకు ముందు సత్యవేడులో టీటీడీ కల్యాణ మండపానికి భూ సర్వేను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీ రమేష్, ఏఈ రవి, గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఏడీని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, రమేష్, సీఐ మురళినాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వీకేఎస్ బాషా, మాజీ ఎంపీటీసీ వినాయకం, శశిమోహన్, ప్రభాకర్ రెడ్డి, ఆర్ముగం, వెంకటేశ్వరు, మురళి, శివానందం, బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శివయ్యా! ఈ చోద్యం చూడయ్యా..



శ్రీకాళహస్తి ఆలయానికి వచ్చే భక్తులు పాదరక్షలు వదిలేసి దర్శనానంతరం 4వ గేటు నుంచి ఎండ వేడిమి కాళ్లు కాలుతూ పరుగులు తీస్తున్నారని వచ్చిన కథనంపై అధికారులు స్పందించి ఫుట్‌పాత్, వైట్ పెయింట్ ఏర్పాటు చేస్తారనుకుంటే మ్యాట్‌ను ఏర్పాటు చేశారు. అయితే నిత్యం ఈ ప్రాంతంలో వాహనాలు, దుకాణాల నుంచి నీరు పడుతుండటంతో ఆ మ్యాట్‌లు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. కూల్ పెయింట్ వేస్తే సరిపోయేది. మూన్నాళ్ల ముచ్చటగా ఉండే మ్యాట్‌లను వేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. - శ్రీకాళహస్తి

'ఉపాధి' పని వేళల మార్పు

శ్రీకాళహస్తి: ఎండల తీవ్రత దృష్ట్యా సీఎం చంద్రబాబు ఉత్తర్వుల మేరకు ఉపాధి హామీ కూలీల పనివేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఎంపీడీఓ రఫీఖాన్ మంగళవారం తెలిపారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పనులతోపాటు పనుల ప్రదేశంలో కూలీలకు మంచినీరు, నీడ వసతి కల్పిస్తున్నామని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్టు తెలియజేశారు.

కేంద్రమంత్రికి ఆహ్వానం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ కట్ట పుట్టాలమ్మ దేవాలయాన్ని సందర్శించాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆహ్వానించినట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త వాసు తెలిపారు. రేణిగుంట మండలం కరకంబాడిలోని శ్రీ కట్ట పట్టాలమ్మ దేవాలయం ఆవరణలో మంగళవారం కురకాల్వ వాసు విలేకరులతో మాట్లాడారు. ఇటీవలే గుంటూరులో కేంద్రమంత్రిని ఒక కార్యక్రమంలో కలిసినట్టు చెప్పారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఏపీ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్ణ నారాయణ రావు, కార్యదర్శి పీఎల్ రావు, సభ్యులు ఉన్నట్టు ఆయన చెప్పారు.

ప్రయాణం నరకం

నాగలాపురం: మండలంలోని ఎస్.ఎస్.పురం -బీరకుప్పం మార్గం పూర్తిగా రోడ్డు గుంతలుమయంగా మారింది. ఈ మార్గంలో ద్విచక్ర వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు నడుమ వెళ్లాల్సి వస్తోంది. మార్గం గుండా అక్కడక్కడ రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో రాత్రి వేళలో ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు మోటారు సైకిళ్లు అదుపు తప్పి రోడ్డు ప్రమాదానికి గురవుతున్నారు. మేజర్ పంచాయతీ అయిన నాగలాపురానికి అటు సత్యవేడుకు అనేక పనులు నిమిత్తం వెళుతూ ఉంటారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలవడం వల్ల గుంతలు కనబడక కింద పడి ఆస్పత్రి పాలవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. సంబంధిత ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముక్కంటి సేవలో..



ఆలయం వద్ద డాక్టర్ షితీజ్ బాలి

శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ షితీజ్‌బాలి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ డి. శ్రీహరి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యురాలిని మోసం చేసి రూ.60 లక్షలు స్వాహా!

నాయుడుపేట టౌన్: నెల్లూరుకు చెందిన ప్రముఖ వైద్యురాలికి అధునిక వైద్య పరికరాలను ఇస్తామని చెప్పి ఆమె వద్ద నుంచి రూ.60 లక్షలు స్వాహా చేసిన వ్యక్తిపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట పట్టణంలోని ఆంధ్రాబ్యాంక్ వీధిలో నివాసం ఉంటున్న వి.సత్యనారాయణ నెల్లూరుకు చెందిన ప్రముఖ వైద్యురాలు బిందు మీనన్‌కు ఇతర ప్రాంతాల నుంచి అత్యాధునిక వైద్య పరికరాలను తీసుకొచ్చి ఇస్తామని నమ్మబలికాడు. తక్కువ ధరకే లక్షలు విలువ చేసే పరికరాలను ఇస్తామని చెప్పడంతో ఈ నెల 21వ తేదీ సత్యనారాయణకు వైద్యురాలు రూ.60 లక్షలు నగదు ఇచ్చింది. అయితే పరికరాలు పంపక పోవడంతో ఈవిషయమై సత్యనారాయణను నిలదీసింది. అయితే సత్యనారాయణ ఆమెను బెదరించడంతో ఖంగుతింది. నగదు విషయమై అడిగేందుకు వైద్యురాలు రెండు రోజుల కిందట నాయుడుపేటకు వచ్చి తన వద్ద తీసుకున్న నగదు ఇచ్చేయాలని కోరింది. నగదు ఇవ్వకపోగా సత్యనారాయణ ఆమెపై దౌర్జన్యం చేయడంతో మంగళవారం వైద్యురాలు నాయుడుపేట సీఐ బాబిని కలిసి మోసం చేసిన వైనంపై ఫిర్యాదు చేసింది. మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిని మంగళవారం రాత్రి గూడూరు కోర్టు న్యాయమూర్తి వద్ద హాజరు పెట్టి రియాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలు ముఖ్యం

- జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు



రేణిగుంటలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందివ్వడమే విధులు నిర్వర్తించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. రేణిగుంట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను ,కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. అలాగే గర్భవతులను, బాలింతలను వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం వైద్యసిబ్బందితో సమీక్షించారు. గర్భధారణ-సంరక్షణ, ప్రసవం తర్వాత తల్లీబిడ్డ సంరక్షణ, యుక్త వయస్సులో జాగ్రత్తలపై స్త్రీలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి కోసం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య పథకాలను వివరించారు. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు తీసోకవాల్సిన జాగ్రత్తలపై మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, డీపీఓ ప్రకాష్, సీహెచ్ ఓ హైమావతి, సూపర్‌వైజర్ నరేష్, ఎంపీహెచ్ఎస్ అనూరాధ, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులోకి ఫ్యాక్టరీల వ్యర్థాలు



చెరువులోకి వస్తున్న ఫ్యాక్టరీల వ్యర్థాల నీరు



ఉపాధిలో జేసీబీతో చేసిన చెరువు చానల్ పనులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని భవానిశంకరపురం గ్రామ చెరువులోకి కజారియా, బ్యాటరీ కర్మాగారాల్లోని వ్యర్థాల నీటిని వదులుతున్నారని మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్ రాజయ్య, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ చెరువులోకి కర్మాగారాల వ్యర్థాల నీటిని వదలటం వలన చెరువులోని నీరు కలుషితం అవుతుందని, ఈ నీటిని తాగి టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతున్నామని తెలిపారు. నీటిని చెరువులోకి వదలవద్దని పలుమార్లు ఫ్యాక్టరీల యాజమాన్యాన్ని వేడుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. ఉపాధిహామీ పథకంలో చెరువు చానల్స్ మరమ్మతులు, చెరువు కట్టపై ఉన్న చెట్టు, పుట్టలను తొలగించడానికి పనులు మంజూరయ్యాయి. అయితే ఈ పనులను కూలీలచే కాకుండా జేసీబీ యంత్రంతో చేయించి, కూలీల కడుపు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.
దీంతో పనులు లేక కూలీలందరూ వలస పోతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఫ్యాక్టరీల వ్యర్థాలను చెరువులోకి రాకుండా చూడాలని, ఉపాధి పనులను కూలీలచే చేయించాలని కోరారు.

ఆత్మరక్షణకు శిక్షణ అవసరం



విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్సుపై శిక్షణ ఇస్తున్న దేవా

శ్రీకాళహస్తి: ప్రస్తుత కాలంలో మహిళలు, బాలికలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోందని, ఇటువంటి పరిస్థితుల నుంచి బైటపడానికి ఆత్మ రక్షణకు శిక్షణ పొందడం ఉపయోగపడుతుందని ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం కరాటే మాస్టర్ దేవా విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం మాట్లాడారు. సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను విద్యార్థినులు నిశితంగా పరిశీలిస్తూ ఉండాలని, ఆగంతకులు, అనుమానాస్పద వ్యక్తుల వల్ల అనుకోని ప్రమాదాలు ఎదురైతే వారిని ఎదుర్కోవడానికి కరాటే లాంటి విద్యలు ఆత్మరక్షణ ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు ఇందిర, సరోజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.